# కులభ్రష్టుడు

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

(గత సంచిక తరువాయి)

'వొదినా—ఇటు చూడు. ఎవరేమనుకుంటున్నారో అని వెనక్కి తిరిగి తిరిగి చూచుకుంటూ పోయినన్నాళ్లు మనల్ని దరిద్రం వెంటాడితీరుందనుకో. అక్రమానికి ఒడిగడుతున్నామా అని ప్రశ్నవేసుకోవాలి—చాలును.

'నిజానికి ఈ దరిద్రమంతా మనం కొని తెచ్చుకున్నదీ, కోరితెచ్చుకున్నదేను. చెప్పమంటావా?

'ఏ ఖర్చయినా పెట్టేటప్పుడు, మన స్తోమ తెంతో, మనకొచ్చే అయివేజులేమిటో, మన ఆదాయ మెంతో, మన మెంతలో ఉండాల్నో ఎప్పుడు లెక్క వేసుకున్నాం చెప్పు?

'అసలీ కొట్టు మీద రెండువేల రుణమెందుకు చెయ్యాలిశొచ్చిందో నీకు తెలియదు. నాకు తెలును. చెబతా విను...'

జానకమ్మ మెదలకండా ఊరుకుంది. ఏమో ఒకప్పుడు చెప్తారు గనకనా? తను పట్టించుకున్నదీ లేదు. ఇంటో మునగానాం తేలానాం సరిపాయె.

అలవాటుకొద్దీ ఖాళీజేబుల్లో సిగరెట్లకని తడుముకున్నాడు కిష్టుడు. వెల్లకిలా పడుకుని, కాలి మీద కాలు వేసుకుని చెప్పుకుపోతున్నాడు.

జానకమ్మ సావధానంగా వింటున్నది.

'అప్పుడు—అన్నాయి—అదేమో దిగులుగా వుండే వాడు...కొట్టేమో ఊరికి కాస్త దూరంగా వుంది... ఇప్పుడు పలికినంతగా బేరమంతగా పలక్క లాభాలు పల్చపల్చగావుండి అన్నయ్యకి ఎక్కాత్రీగా లేదు.

'దానికి తోడు ఆ మధ్య ఒకళ్లిద్దరు పిల్లలు పుట్టిపోయారు.

'ఇంటో రోగాలు రొచ్చులు.

'శనిగ్రహం పట్టుకుని పీడిస్తోంది అనేవాడు అన్నయ్య—ఇక చూచుకో ఆ శనిగాడు ఎక్కడున్నాడా అని వెతకడం ప్రారంభమయింది.

'అప్పుడదిగో ఆ గోవిందయ్యతో దోస్తీ అన్నయ్యకి. గోవిందయ్య పాపం మంచివాడే కాని కొందరి మంచితనం, వదినా, మనల్ని నట్టేటో ముంచుతుంది.

'ఎవరో గడ్డపాయన్ని తీసుకొచ్చాడు గోవిందయ్య వాస్తులో నిధి అట. ఆయనొచ్చి పరీక్ష చేశాడు మన కొట్టూ స్థలమూ.. అవేగా మనకున్న నిక్షేపాలు.

'ఇంకా నయం, అద్దెకొంప వొదిలేశాడు.

'అమట్ను అదిగో ఆ నుయ్యి తూర్పుదిశగా వుంది; అది పూడ్చి ఈశాన్యంలో తవ్వమన్నాడు. దానిని పూడ్చేందు కెంతయిందో, దీనిని తవ్వేందుకు రెండింతలయింది. ఇంతాజేసి పూడ్చేసిన పరలనుయ్యి మంచినీళ్లది......కొబ్బరినీళ్లల్లే తియ్యగా వుండేవి నమ్ము...కొత్తగా తవ్విన నూతిలో నీళ్లు ఉప్పన గాదు సరిగదా చేదు కషాయం...అక్కడ ఒక కిరసనాయిలు గనిగాని వున్నదేమోనని ఇప్పటికీ నమ్మకం నాకు...నీళ్లమీద నూనెతరకలు తేలి కనిపిస్తాయి వదినా.

'ఇక పోతే ఉత్తరపుదిక్కునవున్న చెక్కగది పెంచమన్నాడు; దక్షిణపువేపునవున్న పెద్దగది పడ

గొట్టమన్నాడు; గుమ్మమున్నచోట కిటికీ పెట్టమన్నాడు; కిటికీవున్నచోటికి గుమ్మం మార్చమన్నాడు; విడగొట్టిన గుమ్మాలసైజూ కిటికీలసైజూ వాస్తుకి నప్పలేదన్నాడు; పాతవి విరిచి పొయిలో పెట్టాం; కొత్తవి కొన్నాం.

'బ్లాకులోకూడా సిమెంటు దొరకని రోజులవి'

'ఇంచుమించు పాతయిల్లు పడగొట్టి కొత్తయిల్లు కట్టామనుకో.

'అన్నాళ్లా కొట్టు మూశాంకదా.

'ఇల్లు గడవక అయిదారు వందలు అప్పు చేశాం పైన.

'వాస్తు పూరాగా తెలిసినవాడికి మల్లే— వాడు – ఆ గడ్డపాడు – ఎంత శాస్త్రీయంగా కొంప ముంచాడనుకున్నావు? దానికి బహుమతికింద పంచెల చాపూ మాటపదహార్లూ పట్టుకుపోయాడు పైపెచ్చు.

'అప్పుడు ఆ రిపేర్లకని తణఖా పెట్టితెచ్చిన రుణం ఈనాటికీ తీరలేదు. తణఖా లేకుండా తెచ్చిన రుణం అయిదారువందలు తీర్చాడు అన్నయ్య ఇంతవరకూ.

'వాస్తు మహిమ! కొండనాలిక్కి మందు వేస్తే ఉన్న నాలిక ఊడి చక్కాబోయేలా వున్న దిప్పుడు.

'నేను చన్నీళ్ల జల్లుతోనేవున్నా. 'అన్నయ్యా— ఏమిటీ చాదస్తం? మద్రాసులో చూడు...లక్షాధికార్లున్నారు...లక్ష్మీపుత్రులు...గాలీ వెలుతురూ— అంతే చూచేది...ఈ వెన్నుపోట్లూ, రోడ్డుశూలలూ, మట్టి మశానమూ, వల్లకాడూ వశనపురమూ. ఇవన్నీ మనకే పట్టేది' అన్నాను. వింటేనా?'

మెదలకండా ఊరుకుంది జానకమ్మ. కిష్టయ్య నమ్మకాలు మహాప్రమాదకరమయినవని ఆమెకి తెలుసు.

'గొప్పగా దేవుణ్ణి తలుచుకుని నిప్పులో వేలు పెడితే కాలకమానదు వదినా...

'కన్నుపోతే పోయింది సూర్య నమస్కారాలు చెయ్యాలంటే ఏలా?

'ఖర్మ...తెలిసిచేసినా తెలియకచేసినా ఫలితం నెత్తిన రుద్దుతాడు భగవంతుడు.'

కిష్టుడుకి దేవుడంటే నమ్మకంలేదనీ, నాస్తికుడనీ అంటారందరూను, జానకమ్మ సమేతూ— కాని ఇదిగో...ఈ ఆపత్తులన్నీ దేవుడు విధించిన శిక్షలే నంటాడు కిష్టయ్య.

జానకమ్మకి ఆవలింత లొచ్చినై. ఈలోపున ఒక చిన్న చీటీమీద ఇద్దరసాముల పేర్లు రాసుకుని సిద్ధం చేసుకున్నాడు కిష్టుడు. ఒకడు రూపాయా, ఒకడు రెండు రూపాయిల చిల్లరా ఇవ్వాలి కిరాణా కొట్టు వాడకంకింద. నంగనాచులల్లే మాట్టాడరు. మన్నాడు దోమాడకరణంలా ఎక్కడున్నా పట్టుకోవాలి వాళ్లని.

కాని బొచ్చెంత కాలిస్తేమటుకు బొగ్గవుతుందీ?

ఆ రాత్రి నిద్రపట్టలేదు కిష్టయ్యకి.

* * *

నరసుకి మాణిక్యంగారి సమంధం వచ్చింది— వెనక్కి వెళ్లింది.

వాళ్లకేదో దుర్వాసన కొట్టిందనే అంటున్నాడు నరసింహంగారు.

అలా చెబుతోనే, వ్యవహారం చెడకుండా సర్దుబాటు చేశేందుకు సతమత మవుతున్నట్టు అభినయిస్తున్నాడు.

నగచినట్టూ ఉండాలె, వాతపెట్టినట్టూ ఉండాలె. బిడ్డను గిల్లనూగిల్లాలి, ఉయ్యాల ఊపనూ ఊపాలి.

చూడగా చూడగా, ప్రస్తుతం కొట్టు తెరిచేందుకు కావాలిసిన మూడునాలుగు వందలకి తోడు ఇంకొక వెయ్యిరూపాయిల అవసరం ఈ కుటుంబానికి కనిపించాలని ఈయనగారు శాయశక్తులా తంటాలు పడుతున్నట్టు కనిపిస్తోంది. ఎందుకో మరి?

పోనీ ఆ కొట్టుమీదనే కావలసిన పైకం రుణమియ్యరాదా అని కిష్టయ్య స్వయంగానూ, రాయబారాలూ నడిపీ ప్రయత్నించి చూచాడు.

దానిమీద తణఖా బరువు క్రమేపీ ఎక్కువ కావడం ఆయనకే లాయికీకదా. అందుకేగా తణఖా పత్రం తన పేర బదలాయించుకున్నాడు. అంత అప్పు తీరేనా పెట్టేనా? కొసకెట్లాగూ ఆ కొట్టూ స్థలమూ ఆయన పాలబడేదేగా.

కాని, ఆయన పట్టు, అవి ఇప్పుడే తెగనమ్మించి దఖలు పర్చుకోవాలని. ఆమాటయినా అక్షరాలా అనడు ఎక్కడా; జానకమ్మ చాలా.—కిష్టుడు చాలా అనిపించాలి; అదీ ఆయన ఎత్తు.

అది పారలేదు.

తరవాత మార్కండేయుల్ని తరిమాడు తణఖా బాకీమాట ఏమిటని—జానకమ్మకి గాబరాగా వుంది.

కిష్టాయికి కబురొచ్చింది. రాను పొమ్మన్నాడు. ఇప్పుడమ్మేదిలేదని ఢంకా బజాయించి చెప్పేశాడు. ఏమి చేసుకుంటావో చేసుకోమన్నాడు.

జానకమ్మని నంగినంగిగా మాట్లాడవద్దన్నాడు. నిష్కర్షగా చెప్పెయ్యమన్నాడు.

ఆ స్థలం క్రయంగాకుండా చేస్తున్నది వీడేనని నరసింహంగారికి గట్టిగా ముద్రపడిపోయింది. ఒకళ్లిద్దరిదగ్గర కిష్టాయి అన్నాడుకూడా. ఏమనీ? 'ఈ నరసింహంగారు చచ్చి గీపెట్టినా ఆ కొట్టూ స్థలమూ ఇప్పుడు అమ్మనుగాక అమ్మను' అని.

మొట్టమొదట వీడి భరతం పట్టాలనుకొన్నాడాయన.

హేమాహేమీలు పక్కకి తొలుగుతారాయనకి. ఆయనతో కయ్యానికి కాలు దువ్విన వాళ్లని శంకరగిరి మన్యాలు పట్టించిన సందర్భాలు జానకమ్మ ఎరుగును. ఎందు కితగాడు ఆయన్ని రెచ్చగొడుతున్నాడు? ఏదో కాళ్లావేళ్లాపడి బ్రతిమలాడుకొని, నాలుగు రోజు లాగమని ప్రసన్నుణ్ణి చేసుకోరాదా?

కాని కిష్టాయి అంత తెలివి తక్కువ వాడేమీ కాదు. ఏమీ ఆధారం లేకుండా అతగాడు నరసింహంగారితో కుస్తీపట్లకి దిగడం లేదు. ఎందుకు ఆయనిట్లా తనమీద పట్టించాడూ అని దర్యాప్తు చేశాడు ఇటీవల.

కీలకం దొరికింది. కిష్టావతారమని డి.యి.వో ఆఫీసులో గుమాస్తా మొన్న బస్సుస్టాండులో యాదృచ్ఛికంగా అవుపించి ఓ చిన్నరహస్యం చెవిలో వూదాడు. అమట్న ధైర్యం వుంజుకున్నాడు కిష్టుడు.

* * *

కిష్టుడు వ్రాసిన ప్రోనోటు బాకీకని రిజిస్టరు నోటీసు వచ్చింది.

దానికి సమాధాన మివ్వలేదు కిష్టయ్య.

నోటీసు వచ్చిందని జానకమ్మకి చెప్పలేదు.

ఆ రాత్రి నరసింహంగారు జబర్దస్తీగా కలుపుకున్న ఆస్తుల వివరణ వచ్చింది.

జానకమ్మ ఊ కొడుతూ అందుకొంది.

ఎన్ని ముదనష్టాలు పోగుపడితే ఇంత ఐశ్వర్యం ఆయన చుట్టూ పేరుకుంది!

అవతల వీధిని రాయుడుగారి అద్దాలమేడ... ఇరవై వేలు చేస్తుంది... విరుడు స్వాధీనం చేసుకున్నాడీయన. దానికి వేరుపురుగు నాలుగువేల ప్రామిసరీ నోటుతో ప్రారంభమయి, చక్రవడ్డీలతో బలిసి అంతింతై, ఆఖరికి దాన్ని మింగి చక్కావూరుకుంది.

రావికుంటలో అదిగో ఆ రామయ్యతాత పొలం...పదిహేను ఎకరాల ఖండ్రిక...సుక్షేత్రమైన మాగాణి... మొన్నమొన్న క్రయం రాయించుకున్నాడు. ఆ రామయ్యతాత కూతుళ్ల పెళ్లిళ్లు ఘనంగా చేశాడని ఇప్పటికీ చెప్పుకుంటారు. అందుకని అప్పట్లో వ్రాసిన తణఖా దస్తావేజు ఎంత చిన్నదో ఎవరికీ తెలియదు.. ఆ తణఖాదస్తావేజు తిరగ రాయగా రాయగా......ఇప్పటికి......అంటే ఆ రామయ్యతాత మనమడి హయాం వచ్చేసరికి...పండి పక్వానికొచ్చింది.

ఆ కొండ్రడ కాస్తా గుటుక్కున మ్రింగాడీయన పిప్పరబంటి బిళ్లల్లే.

ఇలా ఒకటేమిటి? రుణమూ, మధుమేహ మున్నవాడి వ్రణమూ మానుపట్టవు...అలాఅలా పెల వేస్తూ పోతాయంతే.

ఎంతమంది నెత్తిన చేతులు పెట్టలేదీయన? ఇదుగో ఇప్పుడు మన 'టరన్' వచ్చింది—అన్నాడు కిష్టయ్య.

గుడి మ్రింగేవాడికి నందిపిండి వడియంట.

చిత్రం—ముదనష్టాలు కలిసినకొద్దీ నరసింహం గారికి ధనదాహం ఎక్కువయింది. నడమంత్రపు సిరి నరాలమీద కురుపులాంటిది. తెగ సలుపుతుంది.

అసలు తింక్షీ గుడ్డా గూడూ మినహాయించి గుట్టకింద పోగుపడిన ఏ ఆసామీ ఆస్తి అయినా సరే...దాని చరిత్ర కుళ్లగించి చూస్తే పడిపోయిన జీవితాల గోడలు...కరుడుగట్టిన కన్నీటి అగాధాల గాథలు...పెళ్లలు పెళ్లలుగా బయటపడతయ్యంటాడు కిష్టుడు.

చీమలు పుట్టలు పెడితే పాములు దూర తయ్యందులో అంటాడు. కాని పుట్టలు పెద్దవైతే చీమలే పాములకింద మారతాయని ఒప్పుకోడు.

కిష్టయిది అదో గుంటలెక్క.

కష్టపడి సంపాయించుకుని, కాపీనంగా బ్రతికి, నెత్తురూ చీమూ కూడబెట్టినట్టు, కాస్త కాస్త వెనకేసి, ఆస్తులు పెంచినవాళ్లు లేరట్రా అంటే తెల్లబోతాడు కిష్టుడు.

లంకలో పుట్టినవాళ్లంతా రాక్షసులే వాడికి.

జానకమ్మ సావధానంగా వింది.

ఈ కిష్టయ్య నరసింహంగారిని గురించి ఇంతింత సమాచారం సేకరిస్తున్నాడు దేనికని? ఇంతింత ద్వేషం పెంచుకుంటున్నాడు తగునా?... జానకమ్మకి విపరీతంగా భయం పుట్టింది.

ఏదో అనుమానం కుదిపేసినట్టయి—

'కిష్టయ్యా' అని ఒక్క అరుపరిచింది.

'నువ్వుగాని నరసింహంగారిమీద ఏమీ దవుర్జన్యం చెయ్యబోవడంలేదుగదా?'

తేలికగా నవ్వేశాడు కిష్టుడు.

'అదేంలేదు వదినా...ఆయనంటే నాకు కక్షగా వున్నమాట నిజమే. కాని ఆయనమీద నాకున్న పగ తీరనిపగ...తీరదు...దవుర్జన్యానికి దిగితినా మరు క్షణం జైల్లో ఉంటాను. నాకు తెలీదూ?... ఆయనమీద పగ సాధించడమే ముఖ్యమైతే అదో లెక్కలోది కాదనుకో...కాని, ఆ తరవాత మిమ్మల్ని బ్రతకనిస్తాడా? అంచాత, ఆయన జోలికిపోను నేను. నువ్వు నిశ్చింతగా వుండు.'

అమ్మయ్య.. జానకమ్మ గాఢంగా ఊపిరి తీసుకుంది.

* * *

తరవాత కిష్టయ్య రెండుమూడు రోజులు ఇంటి ఛాయలకే రాలేదు.

విప్పాయిని పంపింది జానకమ్మ.

బిస్సుపట్టాండులో లేదు

జానకమ్మకి ఆందోళనగా వుంది.

ఇన్నాళ్లా అతగాడు దవుర్జన్యాలకి పాల్పడడు కదా అని భయపడింది; ఇప్పుడు అతనిమీద దవుర్జన్యం జరగలేదుకదా అని విలవిల లాడింది.

కాని ఒకనాడు లాకుల కెగువని పందుకొని అవుపించాడనీ, ఒకరాత్రి గోరీలదొడ్డిదగ్గర రోడ్డు మలుపులో వొంతెనపిట్టగోడమీద నిదరపోతుండగా చూచాననీ పక్కింటి భావనారాయణ చెప్పగా వింది. నిశ్చింతగా వుంది.

* * *

నాలుగోనాడు రాత్రి—

తలుపు గొట్టినట్టయి, కళ్లు నులుము కొంటూ గెడతీసింది నరుసు.

కిష్టయ్య లోపలి కొచ్చాడు.

కళ్లల్లో ఊపిరి పెట్టుకున్నాడు

జుట్టు రేగివుంది.

జానకమ్మా పిల్లలూ అంతా బిలబిలలాడుతూ లేచి వచ్చేశారు.

తెలతెలవారుతోంది.

కిష్టయ్య నవారు మంచంమీద కూలబడ్డాడు.

అందరూ చుట్టూ మూగారు —

'వినండి...ఎవరూ ఏమీ కంగారు పడవద్దు' అన్నాడు.

విశ్వాన్ని పిలిచి మూడువందల రూపాయిల కట్ట చేతిలో పెట్టాడు.

'ఇవి పట్టికెళ్లి పురుషోత్తంగారి హోల్‌సేల్ కొట్లో జాబితా ఇచ్చిగాని ఆ మేరకి కొనుక్కు తెచ్చుకో సరుకులు.. చిల్లరగా ఎలా అమ్ముకుంటే లాయకీనో ఆయనే చెప్తాడు...రేపటినించీ కొట్టు తెరు...తెలిసిందా?

'నువ్వు స్కూల్‌ఫైనల్ ప్యాసయినా ఇప్పట్లో డవాలీబంట్రోతు ఉద్యోగమేనా దొరకదు.. అథవా ఏ గుమాస్తాగిరీ అయినా దొరికినా ఆ ముష్టి నూటపాతికా పుచ్చుకుని లింగూలిటుకూమంటో నువ్వు దేశాలు పట్టిపోతే...ఇక్కడ...ఈ పిల్లలంతా ఏమయి పోయేట్టు? అంచాత...చదువు మాను. తెలిసిందా?'

నోట్లు లెక్కపెడుతో, ఎక్కడిదీ డబ్బు అన్నట్టు చూచింది జానకమ్మ.

'ఈ డబ్బు నేనేమీ దొంగతనం చెయ్యలేదు. శ్రీనివాసయ్యరు కాఫీహోటల్లో ఏణ్ణర్థం పనిచేస్తానని కంట్రాక్టు వ్రాసిచ్చా..మూడువందలు ఎడ్వాన్సిచ్చాడు—అదీ కథ.

'ఇక పోతే ఈ వూరికి కాలేజీ సాంక్షనయింది వదినా. కాలేజీ మన స్థలం పక్కనే పడుతుందట. ఇంకా ఎవరికీ తెలియదనుకో...కిష్టమాచార్లు చెప్పాడు నాకు...మన స్థలం వెయ్యిగజాలుంది... కాలేజీ పడిందంటే గజం పాతిక రూపాయిలు పలుకుతుంది...కొట్టు మిగుల్చుకున్నా మన అప్పులన్నీ తీరగా డబ్బు పుష్కలంగా చేతికొస్తుంది...వరునికి మంచిసమంధమే వస్తుంది...తాడూ బొంగరంలేని చట్కారీ సమంధాలు చూడవద్దు.

'నరసింహంగారు కాలేజీ కమిటీలో మెంబరు... ఈ రహస్యం ఆయనకీ తెలుసు.. అది మభ్యపెట్టి... ఆ స్థలం తురతుర క్రయం రాయించుకుని, గజం ఏ మూడువో నాలుగువో లెక్కకట్టి మన నెత్తిన చేతులు పెట్టి, అది భుక్తం చేసుకుందామని చూస్తున్నాడు దుర్మార్గుడు.

'అది కుదరకుండా చేస్తున్నానని నా మీద కక్ష.

'అంచాత నే నివ్వాలసిన ఎనిమిది వందలు ప్రోనోటు బాకీకీ నామీద దావా వేశాడు...నీతో చెప్పలేదు బెంబేలైపోతావని...అది మునసబుకోర్టులో ఎక్సుపార్టీగా డిక్రీ అయిందిలే. నామీద వారంటు పుట్టింది.'

'వారంటే ?'

జానకమ్మ కొయ్యబారిపోయింది.

పిల్లలు అదేమిటో అర్థంకాక ఒకళ్లమొహా లొకళ్లు చూచుకున్నారు

'ఆ...ఎరెస్టువారంటు.. తాగలేక పిల్లి బోర్లదోసుకుందట...నన్ను కటకటాల వెనక్కి నెడితే నీ మెడలు వంచవచ్చుననుకుంటున్నాడు వాడు... కావాలంటే దావా వేసుకోనీ...అది తేలేసరికి కాలేజీ పడనేపడుతుంది...మరేమీ ఫరవాలేదు...ఈలోపుగా కొట్టుమీద అమ్మకాలు సాగితే ఇల్లు ఎత్తిపోతుంది కదా.

'సిపాయికీ కొట్టుమీద అనుభవముంది ఇది వరలో.

'ఈ రెండు రోజులూ ఇంటికి రాలేదు నేను అరెస్టు చేస్తారని...అక్కడా అక్కడా దాక్కున్నా ననుకో...కాని ఎన్నాళ్లని దాగను? పిడుగుకి గొడుగడ్డమా?'

'అయితే నిన్ను జెయిలుకి పంపి మేమిక్కడ కులుకుతో కూచోమా?'

జానకమ్మకిదంతా ఏ పాపఫలమా అని కోతగా వుంది లోపల.

'అదిగో, ఆ నీళ్లుగారిపోవడమే వద్దు...ఏవీ ఖంగారు లేదు–జెయిలన్నావూ? ఇదిగో మన ఈ అద్దె కొంపకన్న గట్టిగానే వుంటుంది...చెక్కతలుపులికి బదులు ఊచలతలుపులు...పనీపాటా ఉండదు...ఇంత తిననూ, పండుకోనూ...బలాదూరు తిరగనివ్వరు...ఏదో నా కంచం నేను కడుక్కోవాలి...నా బట్ట నేను ఉతుక్కోవాలి అంతే...దివ్యచకోరంగా వుంటుందిలే...ఓ యబ్బో ఇట్లాంటివి చూశాలే వదినా...మూడు నెలలు...కాదంటే ఆరు నెలలు కూచుంటా...నువ్వుమాత్రం మెత్తబడేవుస్మీ,వదినా...స్తలంమాట...వాడి మంత్రం పారనివ్వకు అంతే...'

జైలంటే అతని వర్ణన విడ్డూరంగా వుంది జానకమ్మకి.

'ఇక నేను వెళ్లి పోలీసుస్టేషన్లో హాజరయి పోతాను మరి...తప్పించుకొంటూ దొరికినట్టయినా, లాఠీలతో బాత్తారు వాళ్లు.

'వెడుతున్నా వదినా–జాగర్త.'

హుటాహుటిని నడిచిపోతున్నాడు కిష్టయ్య.

జానకమ్మ గుమ్మందగ్గర్నే నిల్చుంది.

'ఎంత దురవస్త వచ్చింది నాయనా నీకు...నాకోసం...నా పిల్లలకోసం ఎన్నిపాట్లు తెచ్చిపెట్టాను నీకు?...లోకం 'కులభ్రష్టుడు' అంటుంది నిన్ను.'

పైటకొంగుతో కళ్లొత్తుకుంది జానకమ్మ.

